# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 27 జూన్ : 2026 విడుదల : 10

**"మీకు ఆవగింజంత**
**విశ్వాసముండినయెడల**
**ఈ కొండను చూచి ఇక్కడనుండి**
**అక్కడికి పొమ్మనగానే అది పోవును**
**మీకు అసాధ్యమైనది ఏదియు నుండదని**
**నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను"**

**-మత్తయి 17:21.**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

జూన్ - 2026

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.150/- , విడి ప్రతి : 15/-


## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-5 |
| 2. | చీకటిలో... | 6 |
| 3. | సువార్త ఉజ్జీవ సభలు | 7 |
| 4. | విశ్వాసం | 8-12 |
| 5. | సువార్తకు తగిన జీవితం | 13-14 |
| 6. | క్షమించలేని ఆత్మ | 15-16 |
| 7. | దొంగల గుహలో ఎనిమిది రోజులు | 17-19 |


## సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥ 9.00

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

# ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు తెలియజేయుచున్నాను.**

**"ఏడవదినమున సూర్యుడు అస్తమింపకమునుపు ఆ ఊరివారు- తేనెకంటె తీపియైనదేది? సింహముకంటె బలమైనదేది? అని అతనితో అనగా"** న్యాయాధి. 14:18.

సమ్సోను ఇరవై సంవత్సరములు ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతిగా ఉండెను. సమ్సోను న్యాయాధిపతిగా ఉన్న కాలములో ఇశ్రాయేలీయులకు శత్రువులైన ఫిలిష్తీయులకు నిద్రపట్టకుండా చేసెను. అతడు దేవుడు తనకు దయచేసిన బలముతో అభిషేకముతో నిండినవాడై శత్రువుల బారినుండి ఇశ్రాయేలీయులను రక్షించెను. తొడలతో తుంట్లను విరుగగొట్టెను, మూడు వందల నక్కలను పట్టుకొని ఫిలిష్తీయుల గోధుమ చేలను తగులబెట్టెను, గాడిద దవడ ఎముక తీసుకొని వెయ్యిమందిని చంపెను. ఫిలిష్తీయులకు సమ్సోను విషయములో ఏమి పాలుపోని పరిస్థితులు ఏర్పడెను. ఇటువంటి సమ్సోనును ఎవ్వరును ఏవిధముగాను నియంత్రించలేరు? సమ్సోను ఫిలిష్తీయుల మీదికి ఎప్పుడు వెళ్ళినా ఒంటరిగానే వెళ్ళెను. దేవుడు ఒక సింహమువలె జీవించటానికి కృపను అనుగ్రహించెను. అయితే అతడు తన జీవితంలో దేవునికి నాజీరు చేయబడిన వాడనే సంగతి మరిచిపోయి దేవుని మార్గములో నుండి ప్రక్కకు వెళ్ళి ఫిలిష్తీయుల కుమార్తెను చూచి, ఆమెను ప్రేమించి తల్లిదండ్రులు వద్దన్నా ఒప్పుకొనక ఫిలిష్తీయుల కుమార్తెను పెళ్ళి చేసికొనెను (న్యాయాధి. 14:10). ఆ దినములలో పెండ్లి కుమారులకు విందు చేయడమనేది మర్యాద. గనుక సమ్సోను ఫిలిష్తీయుల కుమార్తెను చూచుటకు వెళ్ళినప్పుడు ఆమె తండ్రి సమ్సోనుకు విందు చేసెను. మరియు అతని యొద్ద ఉండుటకు ముప్పది మంది స్నేహితులను తోడుకొని వచ్చెను. న్యాయాధి. 14:11. సమ్సోను వారితో "మీకు ఇష్టమైన యెడల ఒక విప్పుడు

కథ నేను వేస్తాను దాని భావం గనుక మీరు నాకు చెప్పగలిగితే నేను మీ ముప్పది మందికి సన్నపునార బట్టలను ముప్పది దుస్తులను ఇస్తాను. ఒకవేళ మీరు ఏడు రోజుల్లో దాని భావమును చెప్పలేకపోతే మీరే ముప్పది సన్నపునార బట్టలు నాకియ్యవలెను" అని వారితో చెప్పెను. అందుకు వారు దానికి అంగీకరించెను. అప్పుడు సమ్సోను వారితో "బలమైన దానిలో నుండి తీపి వచ్చును తినుదానిలో నుండి తిండి వచ్చును. దీని భావం ఏమిటి?" అని వారిని అడిగినప్పుడు వారు చెప్పలేకపోయెను. అప్పుడు వారు సమ్సోను భార్యతో "నీవు నీ భర్తను లాలన చేసి ఈ విప్పుడు కథ భావమును తెలిసికొని మాకు తెలుపవలెను లేనియెడల నిన్నును నీ తండ్రి ఇంటి వారిని అగ్నిచేత కాల్చి వేస్తామని" చెప్పెను. అప్పుడు సమ్సోను భార్య సమ్సోను దగ్గర ఆ విందు దినములు జరుగుతున్నప్పుడు అతని పాదముల మీద పడి ఏడ్చుచు వచ్చెను గనుక సమ్సోను ఆ విప్పుడు కథ భావమును తెలియజేసెను. అటుతరువాత సమ్సోను యొక్క వివాహము బద్దలాయెను. సమ్సోను ఇతర స్త్రీలను మోహించి తన పిలుపును మరచిపోయి అభిషేకమును పోగొట్టుకొని బలహీనుడిగా, తిరుగలి విసరువాడిగా గ్రుడ్డివాడిగా తన కాలమును ఫిలిష్తీయుల మధ్య ముగించెను.

సింహం కంటే బలమైనది మరొకటి లేదు. దేవుని బిడ్డల కంటే బలమైనవారు ఇంకెవరును లేరు. దేవుడు నిన్ను బలమైన వ్యక్తిగా సృష్టించి, తన అమూల్యమైన రక్తమును చిందించి నిన్ను రక్షించెను అయితే నీవు అపవిత్ర పరచబడి, పాపానికి అమ్మబడి, దేవుని చిత్తం నుండి ప్రక్కకువెళ్లి, పాపముతో సహజీవనము చేసినట్లయితే నీవు బలహీనుడవుగా మారిపోతావు. సింహము బలమైనది అయితే నీవు తప్పిపోయిన తరువాత బలహీనమైన వ్యక్తివి అవుతావు అనే విషయమును గ్రహించుకొనవలెను.

సింహము వేటాడుతుంది ఆ వేటాడే సమయములో తన ప్రాణమునైనా పోగొట్టుకొంటుంది గాని జంతువును విడిచిపెట్టి రాదు. **"అందుకు దావీదు సౌలుతో ఇట్లనెను- మీ దాసుడనైన నేను నా తండ్రి**

**యొక్క గొర్రెలను కాయుచుండ సింహమును ఎలుగుబంటియును వచ్చి మందలో నుండి ఒక గొర్రెపిల్లను ఎత్తుకొని పోవుచుండగా నేను దాన్ని తరిమి చంపి దాని నోట నుండి ఆ గొర్రెను విడిపించితిని; అది నా మీదకు రాగా దాని గడ్డము పట్టుకొని కొట్టి చంపితిని"** 1సమూ. 17:34,35. దావీదు అడవిలో గొర్రెలు కాయుచుండగా సింహము వచ్చెను. సింహం ఆ గొర్రెను పట్టుకొని ఎత్తుకొని పోవుచుండగా దావీదు దానిని తరిమి చంపి గొర్రెను విడిపించెను. అప్పుడు సింహం దావీదు మీదికి రాగా దాని గడ్డం పట్టుకొని దాన్ని కొట్టి చంపెను. దావీదు సింహం నోటి నుండి గొర్రెను విడిపిస్తే సింహం దావీదు మీదికి వచ్చి తత్ఫలితంగా తన ప్రాణాన్ని పోగొట్టుకొన్నది గాని పారిపోలేదు. తన నోటిలో నుండి జంతువును ఎవరైనా తీయడానికి చూస్తే తన ప్రాణం పోతుందేమో అనే సంగతి అది మరచిపోతుంది. తన ప్రాణమైనా పోగొట్టుకుంటుంది గాని అది వెనుతిరిగి రాదు. నీవు నాగటి మీద చెయ్యి వేసావు. కుటుంబాన్ని, తల్లిదండ్రులను, భార్యను, బిడ్డల్ని ప్రభువు బలిపీఠం మీద పెట్టి ఇరవై ఏళ్ళ క్రితం, ఇరవై ఐదు ఏళ్ళ క్రితం లేక ముప్పది ఏళ్ళ క్రితం నువ్వు ప్రభువు రాజ్యం కట్టడానికి వచ్చావు. అయితే ఈరోజు నీ శరీరంలో ఆరోగ్య పరిస్థితులు సహకరించటం లేదు, సంఘం నీకు ప్రోత్సాహకరముగా లేదు, చేతిలో పైసా లేదు, ఇప్పుడు ఏమీ చేయలేను నా మరణ కాలం సమీపించిందని తలంచకూడదు. నీ మరణ కాలం ఇంటిలో మంచం మీద కాదు సువార్త సభలో ఉండాలి. సింహం, అది దావీదు మీదకు వచ్చిన సింహం అడవిలో తన ప్రాణాన్ని పోగొట్టుకుంది. సేవకుడు తన ప్రాణం సువార్త కొరకు పోగొట్టుకోవాలి. సింహం అడవిలో ప్రాణం పోగొట్టుకుంటుంది. మన అడవి ఏది? మన సేవా స్థలమే, ప్రజలే. ప్రజల కొరకు తన ప్రాణమును పెట్టిన యేసు యొక్క సువార్త ప్రజలకు అందువరకు నీవు నిద్రపోకూడదు. అట్టి కృప దేవుడు మనకు దయచేయును గాక!

**-ఎడిటర్**

## “చీకటిలో నేను మీతో చెప్పునది మీరు వెలుగులో చెప్పుడి”

–మత్తయి 10:27.

మన దేవుడు మనకు కొన్ని విషయాలు చెప్పాలని మాటిమాటికీ మనలను చీకటిలోనికి తీసుకుపోతుంటాడు. నీడలు కమ్మిన ఇంట్లోకి, ఆవేదన పరదాలు కట్టిన గదుల్లోకి, ఒంటరితనం నిండిన దిక్కుమాలిన జీవితంలోకి, ఏదో ఒక వైకల్యం మనలను పిండిచేసే దుఃఖపు చీకటికొట్టులోకి నడిపిస్తున్నాడు.

అక్కడ అత్యాశ్చర్యం, అత్యద్భుతం అయిన తన నిత్య, అనంత సత్యాలను చెప్తాడు. మిరుమిట్లుగొలిపే ఈ లోకపు కాంతివల్ల గుడ్డివైపోయిన మన కళ్ళకు పరలోకపు నక్షత్ర సమూహాలు కనబడేలా చేస్తాడు. బండబారిన మన చెవులకు తన మృదువైన స్వరాన్ని వినిపిస్తాడు. ఇహలోకపు రణగొణధ్వనులలో అయితే ఆ స్వరం వినిపించదు మరి.

కాని ఈ విధంగా వినడం వల్ల బాధ్యత మన మీద దానంతట అదే పడుతున్నది. దానిని మీరు వెలుగులో చెప్పండి ఇంటి కప్పులమీద దానిని ప్రకటించండి. మనం కలకాలం చీకట్లోనే, మూసిన తలుపులు వెనుకనే ఉండిపోకూడదు. త్వరలోనే జీవితపు త్రొక్కిసలాటలోకి మనమూ వెళ్ళవలసి ఉంది. ఆ సమయం వచ్చినప్పుడు మనం చీకట్లో నేర్చుకొన్న దాన్ని ప్రకటించవలసి ఉంది.

దీనివలన శ్రమలు అనుభవించడంలోను తలాతోకా లేనట్టు అనిపించే సంఘటనల్లోను ఒక క్రొత్త ప్రయోజనం అర్థం మనకు స్ఫురిస్తాయి.

నేనెంత పనికిమాలినవాణ్ణి! మనుష్యుల ప్రయోజనార్థం నేనేమి చేస్తున్నాను? నా ఆత్మ అనే ఈ ప్రశస్థ పరిమళ ద్రవ్యం ఇలా వ్యర్థం కాలవసిందేనా? శ్రమలను అనుభవించేవారు ఇలా వాపోతూ ఉంటారు. అయితే వీటన్నింటిలో దేవునికి ఒక పథకం ఉంది. ఆయన వాళ్ళని తనకు సమీపంగా ఎత్తయిన కొండల్లోకి పిలిచి ముఖాముఖిగా మాట్లాడుతున్నాడు. వాళ్ళు కొండ దిగివెళ్ళి ఎదురుచూస్తున్న జనసమూహానికి ఆ సందేశాలను అందించాలి.

కొండమీద మోషే గడిపిన నలభైరోజులు, హోరేబులో ఏలియా గడిపిన కాలము అరేబియాలో పౌలు గడిపిన సంవత్సరాలు వ్యర్థమెలా అవుతాయి? విశ్వాస జీవితములో దగ్గర దారి అంటూ ఏమీ లేదు. దేవునితో ఒంటరి సంభాషణ, సహవాసం, ధ్యానం ప్రతి ఒక్కరికీ తప్పనిసరి. దైవ సన్నిధి అనే శిఖరాగ్రంలో సహవాసమూ, స్థిరమైన బండసందులో విశ్రాంతికరమైన నిద్ర విశ్వాస జీవితంలో అంతర్భాగాలు, ఇహలోకపు తాపత్రయాలు అంధకారం కమ్మి ఆకాశతారలు కనిపించే

వేళల్లో అనంతమూ, శాశ్వతమూ అయిన ప్రపంచాల దర్శనాలను మన ఆత్మలు చూడగలగడం అన్నది అవశ్యం.

దైవ సన్నిధి మన ఆత్మలో సుస్థిరంగా నెలకొని ఉండాలంటే ఇంతకంటే వేరే మార్గం లేదు. అలాంటప్పుడే మన ఆత్మలు కూడా కీర్తనకారుడితో కలిసి పాడగలుగుతాయి "దేవా నీవు సమీపముగా ఉన్నావు".

## 2026 - జూన్
## సువార్త ఉజ్జీవ సభలు

| | |
|---|---|
| **5, 6, 7** | **రేపల్లె,** గుంటూరు జిల్లా<br>ఉప్పూడి పంట కాలువ ప్రక్కన |
| **8, 9,10** | **నంబూరు,** గుంటూరు జిల్లా<br>శ్రీ కోదూరు పేతురు గారి చేపల చెరువు ప్రక్కన,<br>బాప్టిస్టు చర్చి దగ్గర |
| **11, 12, 13** | **ఆత్మకూరు**<br>హోసన్నా మందిరం ప్రక్కన,<br>కె.జి. రోడ్,<br>యస్.ఆర్.బి.సి.కాలని, కరివేన |
| **15,16** | **అక్కపాలెం,** వినుకొండ దగ్గర<br>మెయిన్ రోడ్ |
| **17,18** | **పాత మల్లాయపాలెం,** ప్రత్తిపాడు |
| రోడ్ | యస్.సి. కాలని |
| **22,23,24** | **వెల్లూరు,** చెన్నై<br>యూనియన్ టీచర్ ట్రైనింగ్ గ్రౌండ్,<br>విరుతంపేట్ |

# విశ్వాసం

**"మీకు ఆవగింజంత విశ్వాసముండినయెడల ఈ కొండను చూచి ఇక్కడనుండి అక్కడకు పొమ్మనగానే అది పోవును మీకు అసాధ్యమైనది ఏదియు నుండదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను" మత్తయి 17:20,21.** యేసుప్రభువు ఈ లోకంలో ఉన్నప్పుడు అనేకమైన అద్భుత కార్యములు చేశారు. మనకు ఆవగింజంత విశ్వాసం ఉంటే గొప్ప కార్యాలు చూస్తాము. దేవునియందు విశ్వాసముంచి ఆయన మీద ఆధారపడి మనము కలిగియున్న ఏ పరిస్థితినైన ప్రభువునకు అప్పగించినప్పుడు దేవుడు గొప్ప కార్యములు చేయును. కొండలను పెకలింపకలిగిన విశ్వాసం ఆవగింజంతే. అయితే ఆ కొంచెం విశ్వాసం ఉంచడం మనకు చాలా కష్టమైపోతుంది. మనము నమ్ముతాము గాని రకరకాల ఆలోచనలు అపవాది మనస్సులో పెడుతుంటాడు. ప్రభువు గొప్ప దేవుడు వాగ్దానములు నెరవేర్చగల సమర్థుడు శక్తిమంతుడు అని పైకి చెప్తాము కాని లోపల ఎక్కడో అల్ప విశ్వాసం. ఇది జరుగుతుందా, నా ప్రార్థన దేవుడు వింటాడా? నేను భయంకరమైన పాపిని కదా! అసలు నాలాంటివారు ఎవరు ఉండరు కదా! అపవాది, నిన్ను- ఏం ప్రార్థన చేస్తున్నావు భలే పిచ్చి ప్రార్థన చేస్తున్నావు? అసలు నీలాంటివాడు భూమి మీద ఎవరు లేరు, నీవు ఘోరమైన పాపివి అనగానే నీకు భయము వణుకు కలుగును. అపవాది నీకు చిన్న మెరుపు లాంటి ఆలోచన పెట్టి అవిశ్వాసాన్ని విత్తుతాడు. ఆవగింజంత విశ్వాసం ఉంచితే నీ జీవితంలో గొప్ప కార్యాలు చేస్తానని దేవుడు సెలవిస్తుంటే అపవాది ఏమో నిన్ను ప్రక్కకు లాగుతాడు. నీ ప్రార్థన దేవుడు తప్పక ఆలకించును. ఆయన హస్తం కురచ కాదు ఆయన చెవులు మందము కాలేదు కాని మన పాపము మనకు ఆయనకు మధ్య ఆటంకముగా ఉన్నది.

**"గాలిని చూచి భయపడి మునిగిపోసాగి ప్రభువా, నన్ను రక్షించుమని కేకలువేసెను వెంటనే యేసు చెయ్యిచాపి అతని పట్టుకొని**

**అల్పవిశ్వాసీ యెందుకు సందేహపడితివని అతనితో చెప్పెను" మత్తయి 14:30,31.** పేతురు ప్రభువు వైపు చూచి కొంతదూరం నీళ్ల మీద నడిచాడు ఆ తరువాత గాలిని చూచి మునిగిపోసాగాడు. మన దృష్టి ప్రభువు మీద నుండి ప్రక్కకు ఎప్పుడు వెళ్ళిపోతుందో వెంటనే సందేహాలు, కలవరాలు, భయాలు ఆందోళనలు మన హృదయములోనికి వచ్చును. అప్పుడు మనము ప్రార్థన చేయలేము, కృంగిపోతాము, నిరాశ నిస్పృహలు మన హృదయాన్ని ఆవరించును. అప్పుడు మనము దేవుని వైపు చూడలేము. మన దృష్టిని అపవాది ఎప్పుడు ప్రక్కకు త్రిప్పాలనే ప్రయత్నిస్తుంటాడు. పేతురు అప్పటివరకు యేసుప్రభువును చూచి నీటి మీద నడువగలిగెను గాని గాలిని చూచి భయపడి మునిగిపోసాగెను. పేతురు మునిగిపోతున్నప్పుడు తాను గాలిని చూడకూడదు ప్రభువును మాత్రమే చూడవలెనని అర్థమయ్యి ప్రభువా నన్ను రక్షించుము అని కేకలు వేసెను. వెంటనే ప్రభువు చేయి చాపి మునిగిపోతున్న పేతురును పట్టుకొనెను.

**1. అల్ప విశ్వాసం సందేహాన్ని పుట్టిస్తుంది భయపడి కలవరపడేటట్లు చేస్తుంది :**

మనము సిలువవేయబడిన క్రీస్తునే చూడాలి. విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసునే చూడాలి గాని మనవైపుచూచుకొనిన మన పరిస్థితులను చూచిన మునిగిపోతాము. నీవు ఎంత అగాథంలో ఉన్నను ఎంత అంధకారంలో ఉన్నను ఎంత భయంకరమైన వ్యాధితో బాధపడుచున్నను ఘోరమైన పాపంలో ఉన్నను ఏ పరిస్థితుల్లోనైన నీ స్థితిని నీవు చూడవద్దు. సిలువవేయబడిన యేసును చూడు, అయితే సందేహం నీలో ఉండకూడదు. ప్రభువా నన్ను రక్షించమని పేతురు ఎప్పుడైతే అన్నాడో తన కనుదృష్టిని ఎప్పుడైతే యేసయ్య మీద నిలిపి యేసు తప్ప నాకెవరూ సహాయం చేయలేరని నన్ను రక్షించు అని కేకలు వేశాడు. అప్పుడు ప్రభువు చేయి చాపి రెప్పపాటు సమయంలో పేతురును రక్షించాడు. పేతురుకు ఈత వచ్చు ఆయన చేపలు పట్టేవాడు. మన సందేహాల్లో మనం అన్ని మరచిపోతాము. మనస్సు ఖాళీ అవుతుంది. మన జ్ఞానం మనలను రక్షించదు. మన తెలివి తేటలు మనలను రక్షించవు. మన తలాంతులు

మన నైపుణ్యం మనలను రక్షించవు. ఎప్పుడైతే మనము ఖాళీ అయిపోతామో అప్పుడు ప్రభువు చేయి అందిస్తాడు. పేతురు తన్ను తాను ఖాళీ చేసుకున్నాడు నిస్సహాయుడైనాడు. నీ ఆలోచనలన్ని నీవు ఖాళీ చేసుకోవాలి.

**2. అల్ప విశ్వాసం దేవుని కార్యాలు చూడకుండ జరుగకుండ ఆటంక పడుతుంది :**

పేతురును లేపినట్లుగా మనల్ని కూడా లేపుటకు ప్రభువు సిద్ధంగా ఉన్నారు. ఖాళీ పాత్రలమై ప్రభువు సన్నిధిలో హృదయాన్ని బోర్లించితేనే విడుదల. అల్ప విశ్వాసం పోయి మనలను మనం ఖాళీ చేసుకొంటేనే దేవుని చేయి మన మీద చాపి ఆయన కార్యాలు జరిగిస్తారు.

**"అప్పుడు యేసు – చూచుకొనుడి, పరిసయ్యులు సద్దూకయ్యులు అను వారి పులిసిన పిండినిగూర్చి జాగ్రత్త పడుడని వారితో చెప్పెను.. యేసు అది యెరిగి అల్ప విశ్వాసులారా – మనయొద్ద రొట్టెలు లేవని మీలో మీరెందుకు ఆలోచించుకొనుచున్నారు" మత్తయి 16:6,8** ప్రభువు పరిసయ్యులు, సద్దూకయ్యులు గురించి చెబుతుంటే శిష్యులు రొట్టెల గురించి ఆలోచనచేస్తున్నారు. పులిపిండి గురించి ప్రభువు మాట్లాడుతుంటే వారి అల్ప విశ్వాసం ఆలోచించుకొనేలా చేసింది. మన ఆలోచనలు ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. మనము ఆలోచించుట మానితే ప్రభువు కార్యాలు ప్రారంభిస్తారు. ప్రభువు కార్యాలు జరుగకుండ అపవాది మన ఆలోచనలను కుదిపేస్తుంది. అచంచల విశ్వాసాన్ని కల్గి ఉండాలని ప్రభువు కోరుకొంటున్నారు.

**"ప్రభువా నశించిపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి ఆయనను లేపిరి. అందుకాయన అల్పవిశ్వాసులారా, యెందుకు భయపడుచున్నారని వారితో చెప్పి లేచి గాలిని సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను ..మత్తయి 8:25-26** యేసుప్రభువు దోనెలోనే ఉండి విశ్రాంతి తీసికొనుచుండగా తుపాను వచ్చేసింది. శిష్యులు ప్రభువు దగ్గరకు వచ్చి మేము నశించుపోవుచున్నామని కేకలు వేసిరి. పరిస్థితులకు భయాందోళన పెంచుకొనకూడదు. మన జీవితములో ప్రభువును అంగీకరించి

ఆయనను వెంబడిస్తున్నా కార్యాలు జరుగకపోవుటకు కారణం ఇది జరుగుతుందా? హృదయములో ఎక్కడో ఒక ప్రక్కన గూడుకట్టుకొని ఉన్న అల్పవిశ్వాసం. మన మీద మనకుండే సందేహాలు భయాందోళనలు కలవరాలనే తుపానులను ఆయన గద్దించి నిమ్మళపరుస్తారు.

అద్భుతం జరిగిన తరువాత ఈయన ఎట్టివాడో అని ఆశ్చర్యపోవుచున్నారు. నీ అంతరంగంలో దేవుని ఆత్మ ఒప్పింప చేస్తున్న, మనస్సాక్షి హెచ్చరిస్తున్న లోబడనొల్లని కఠినత్వం నీలో ఉండకూడదు. ప్రభువు చెప్పారు భయపడకుము నేను నీకు తోడైయున్నాను.

**3. అల్ప విశ్వాసులు చింతిస్తారు :**

**"అబ్రాహాము ఆ చోటికి యెహోవా యీరే అను పేరు పెట్టెను. అందుచేత యెహోవా పర్వతము మీద చూచుకొనును అని నేటివరకు చెప్పబడును" ఆది 22:14.** అబ్రాహాముతో దేవుడు తన కుమారుని మోరియా పర్వతము మీద బలి అర్పించమంటే ఆలోచించకుండ వెళ్ళిపోయాడు. కుమారుడు తండ్రితో కట్టెలు అగ్ని ఉన్నవి గాని బలి అర్పించుటకు గొర్రెపిల్ల ఏది నాయనా అని అడిగితే అబ్రాహాము దేవుడే చూచుకొనునని 'యెహోవా యీరే' అని చెప్పాడు. నీకు ఆవగింజంత విశ్వాసం ఉన్నట్లయితే నీ భక్తి జీవితం గురించి గాని పరిశుద్ధ జీవితం గురించి గాని ప్రతిష్ఠిత జీవితం గురించి గాని సేవ గురించి గాని పిలుపు గురించి గాని అన్నింటి గురించి ఖచ్చితంగా దేవుడే చూచుకొనును. సందేహాలు రాకూడదు. ప్రభువు ఏమి చేసినా అద్భుతకార్యాలే చేస్తారు. గొర్రెపిల్ల వెనుక పొదలో చిక్కుకొని ఉంది. అబ్రాహాము నోటి మాటల్లో దేవుడు శక్తిని ఉంచాడు. సహవాసంలో దేవుడు చేస్తున్న అద్భుత కార్యాలు మనము చూస్తున్నాము అనుభవిస్తున్నాము. చింత అనేది మనకు ఉండకూడదు. మన చింత యావత్తు ఆయన మీద వేయాలి. నీవు నడిస్తే దేవుడే అన్నింటిని చూచుకొనును. అబ్రాహాము ఇస్సాకును బలి అర్పించుటకు సంతోషంగా తీసికొని వెళ్ళాడు. విశ్వాసం వలన అబ్రాహాము బలం పొందుకొన్నాడు. విశ్వాసం మనకు బలాన్ని ఇస్తుంది, శక్తినిస్తుంది, లేవనెత్తుతుంది. విశ్వాసం ఎండిపోయిన స్థితిని

జీవముతో నింపి చిగురింపచేస్తుంది. ప్రభువు అన్ని విడిచిపెట్టి నన్ను వెంబడించు అంటే నీకు సందేహం గాని చింత గాని రాకూడదు. భయం ఆందోళన ఉండకూడదు. చిత్తం ప్రభువా నీ దాసుడు ఆలకించుచున్నాడు అని చెప్పాలి.

**"సందేహాలు ఉంటే దేవుని సమీపించలేము ఆయన కార్యాలు చూడలేము. ప్రతిస్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను" 1తిమోతి 2:8.** ఆవగింజంత విశ్వాసం ఉంచి ప్రార్థన చేయడం నేర్చుకోవాలి. తిరిగి ఇవ్వడంలోనైన, సమాధానపడడంలోనైన శుద్ధ హృదయముతో ప్రార్థన చేయాలి. **సీమోను అత్త జ్వరముతో పడియుండగా వెంటనే వారామెనుగూర్చి ఆయనతో చెప్పిరి. ఆయన ఆమెదగ్గరకు వచ్చి చెయ్యిపట్టి ఆమెను లేవనెత్తెను అంతట జ్వరము ఆమెను వదలెను గనుక ఆమె వారికి ఉపచారము చేయసాగెను"** మార్కు 1:30,31. యేసుప్రభువు బాగుచేయగల్గిన సమర్థుడన్న విశ్వాసముతో ఆమెను గూర్చి ఆయనతో చెప్పారు. ఆయన దయ, కనికరం ప్రేమ కలిగిన దేవుడు కావున ఆయన ఆమె చెయ్యి పట్టుకొని పైకి లేపారు. ఆయన చేతిలో శక్తి ఉంది, జీవం ఉంది. జ్వరం ఆమెను విడిచిపోయింది. నీవు నమ్మితే గొప్ప కార్యాలు చేస్తారు. విశ్వాసంతో సమస్యను ఆయన పాదాల దగ్గరకు తీసుకొని వెళ్ళాలి. నీ హృదయములోనే దానిని దాచుకోకూడదు. దేవా నేను ఇలాగా ఉన్నానని ధైర్యంగా చెప్పాలి. నన్ను విడిపించమని అడిగితే ఆయన విడిపిస్తారు. ఆయన నిశ్చయంగా నీ దగ్గరకు వచ్చి నీ చేయి పట్టుకొని నిన్ను విడిపిస్తారు. నీ సందేహాలు భయాన్ని ప్రక్కన పెట్టి నీ స్థితిగతులు మార్చగలిగిన ప్రభువు దగ్గరకు రాగలిగితే దేవుడు నిన్ను గొప్ప విశ్వాసముతో నింపి నడిపించును. దేవుడు అట్టి కృప మనకు దయచేయును గాక.

# సువార్తకు తగిన జీవితం

దేవుని ప్రజలు విశ్వాస విషయంలోను, దేవుని కుమారుని గూర్చిన జ్ఞానవిషయంలోను ఏకత్వం పొంది, సంపూర్ణులమగునట్లుగా ఉండాలని అపొస్తలుల కాలంలో ఎంతో ఖచ్చితముగా బోధించబడినది. సంవత్సరాలు గడిచిపోతున్ననూ మరగుజ్జులుగా ఎదుగుదల లేకుండా ఇంకా పసిబిడ్డలుగానే ఉన్నవారికి ఎటువంటి ప్రోత్సాహము లభించదు. పసిబిడ్డలు ఎదగాలి, వృద్ధులు బలహీనతలు ఎన్ని ఉన్నా శక్తిలేకపోయినా ఖచ్చితంగా ఫలభరితంగా ఉండాలి. వృద్ధాప్యంలో కూడా యౌవనస్థులవలె బలముగా వృద్ధిచెందాలి. పరిశుద్ధులైన స్త్రీ పురుషులే క్రైస్తవ్యానికి వన్నె తెచ్చేవారు.

ఎంత ధనమైననూ, జ్ఞానమైననూ, ఎటువంటి సంస్కృతి అయినను దేవుని కొరకు ఏమీ చేయలేవు. పరిశుద్ధత ఆత్మకు శక్తిని కలిగించి, మనిషిని సంపూర్ణముగా ప్రేమ జ్వాలలతో మండించి, అధికమైన విశ్వాసం, అధిక ప్రార్థన అత్యధిక తృష్ణ, మరింత సమర్పణ కొరకు వాంఛించేలా చేస్తుంది. దేవుని కొరకు మంటగల భక్తులు లేవనెత్తబడవలెను. ఇలాంటి వారి కొరతను బట్టి దేవుని రాజ్యాభివృద్ధి నిలిచిపోయి ఆయన సంకల్పాలు కుంటుపడి దేవుని నామం అవమానపరచబడుచున్నది. తెలివి, ఉన్నతమైన విద్య, స్థితి, హోదా, స్థానం, ఘనమైన పేర్లు, ఉన్నతమైన కార్యకలాపాలు ఇవి ఏవియు మన దేవుని యొక్క సేవా రథాన్ని కదిలించలేవు. మండుచూవుండే పరిశుద్ధ అగ్ని మాత్రమే దానిని కదిలించగలదు. ఇటువంటి ఆత్మ గలిగిన బ్రైనార్డ్ మాత్రమే దానిని కదిలించగలడు, బ్రైనార్డ్ యొక్క ఆత్మ దేవుని కొరకు, నశించుచున్న ఆత్మల కొరకు నిరంతరం మండుతూ ఉండేది. అందరిని ప్రేరేపించే మరియు ప్రజ్వరిల్లజేసే ఈ శక్తి మరియు మంట యొక్క తీవ్రతను ఏ భూసంబంధమైన స్వార్థము తగ్గించలేదు.

ప్రార్థన అనునది భక్తికి మూలము మరియు మార్గము. భక్తిగల ఆత్మయే ప్రార్థనాత్మ. శరీరము ఆత్మ ఏకమైయున్నట్లు ప్రార్థన మరియు భక్తి ఏకమైయున్నవి. భక్తి లేకుండా ప్రార్థన లేదు. ప్రార్థన లేకుండా భక్తి లేదు. అతిపరిశుద్ధమైన భక్తితోనే బోధకుడు తనను తాను దేవునికి అప్పగించుకొనవలెను. అతడు వృత్తి సంబంధమైన వాడు కాదు, అతని సేవ ఒక వృత్తి కాదు గాని అది ఒక దైవత్వపు సంస్థ, బోధకుడు అన్నింటికంటే ఎక్కువగా దేవునికి అప్పగించుకోవాలి. బోధకునికి దేవునితో గల సహవాసమే తన సేవ యొక్క చిహ్నము మరియు ఆనవాలైయున్నది. అతని భక్తి నామమాత్రముగా ఉండకూడదు. బోధకుడు కృపలో వర్థిల్లకపోతే దేనిలోను వర్థిల్లలేడు. తన జీవితము ద్వారా, తన ప్రవర్తన ద్వారా బోధించలేకపోతే అతడు ఎన్నటికి బోధించలేడు. తన భక్తి లోతులేనిది అయితే అతని బోధ సున్నితముగానూ, సంగీతమంత మధురముగానూ ఉన్నప్పటికి దాని బరువు ఈక వలె తేలికగాను, దాని దర్శనం ఉదయకాలపు మబ్బువలెను, ప్రాత:కాలపు మంచు వలెను ఎగిరిపోతుంది.

ఈ తరములో మునుపెన్నడూ లేని విధముగా ప్రార్థనా ఫలితాలను దేవుని కొరకు నిరూపించాలి. ఆత్మల భారం కలిగి, అత్యాసక్తితో ప్రార్థించే ప్రార్థనాపరులుగా లేకుండా ఏ వ్యక్తి కూడా క్రీస్తు సువార్త శక్తికి నమూనాగా ఉండలేడు. ప్రార్థనారహితమైన ఈ యుగము దైవిక శక్తి యొక్క చాలిచాలని నమూనాలను కలిగి ఉంది. ప్రార్థనలేని హృదయాలు దేవుని యొక్క ఉన్నత శిఖరాలను ఎన్నటికి చేరలేవు. ఒక తరము, గడచిన తరము కంటే ఉన్నతముగా ఉండవచ్చు కాని, ఒక తరములో బలమైన ఆధునిక నాగరికత ద్వారా వచ్చే అభివృద్ధికి, ప్రార్థనాశక్తి మూలముగా కలిగిన పరిశుద్ధత మరియు క్రీస్తు సమరూపము అను వాటి ద్వారా వచ్చే అభివృద్ధికి మధ్య అనంతమైన వ్యత్యాసమున్నది.

# క్షమించలేని ఆత్మ

**"యోనా దీనిచూచి బహు చింతాక్రాంతుడై కోపగించుకొని యెహోవా, నేను నా దేశమందుండగా ఇట్లు జరుగునని నేననుకొంటిని గదా? అందువలననే నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపయుగల దేవుడవై యుండి, పశ్చాత్తాపపడి కీడుచేయక మానుదువని నేను తెలిసికొని దానికి ముందుగానే తర్షీషునకు పారిపోతిని. నేనిక బ్రదుకుటకంటె చచ్చుట మేలు; యెహోవా, నన్నిక బ్రదుకనియ్యక చంపుమని యెహోవాకు మనవి చేసెను"** యోనా 4:1-3.

రక్షణ పొందిన తరువాత కూడా ఈ చేదైన వేరు హృదయములో వుండుట వలన అనేకులు దేవునికి దు:ఖమును కలిగించేవారుగా వుంటారు. దేవుడు నీనెవె పట్టణమునకు వెళ్ళి ఆ పట్టణమునకు దుర్గతి కలుగునని ప్రకటించుమని యోనాకు ఆజ్ఞాపించెను. అయితే యోనా ప్రవక్త నీనెవెకు వెళ్ళక తర్షీషునకు బయలుదేరెను. ఎందుకనగా నీనెవె అష్షూరీయుల ముఖ్యపట్టణము. వీరు ఇశ్రాయేలీయులకు శత్రువులు. ఈ అష్షూరీయులు బహు క్రూరులై ఒకప్పుడు ఇశ్రాయేలీయులను హింసించి చెరపట్టుకొనిపోయినవారు. అందుకే యోనా వారియొద్దకు వెళ్లి ప్రకటించుటకు నిరాకరించెను.

నీనెవె నాశనము చేయబడడము ఇశ్రాయేలీయులకు విజయము వంటిది. ఆ పట్టణము నశించిపోవుట న్యాయమే అనేది యోనా యొక్క తలంపు. దేవుని తీర్పు వారి మీదకి రావడానికి వారు అర్హులే అనేది అతని భావన. వారు చేసిన అన్యాయము బలవంతము, యెరూషలేముకు కలుగజేసిన నాశనము యోనా కళ్ళముందు ఇంకనూ మెదలుతూనే వున్నది. అతడు ప్రవక్తయైనను నీనెవె వారు ఎప్పుడో ఇశ్రాయేలీయులకు కలుగజేసిన నాశనము తన హృదయములో పదిలంగా ఉంచుకొన్నాడు. అందుకే వారియొద్దకు వెళ్లుమని దేవుడే చెప్పినను యోనా దూరముగా పారిపోతున్నాడు.

ఆత్మీయులుగా కనబడే కొంతమంది తమకు ఇష్టంలేని వారిపేరు ఎత్తినను సహించలేక అక్కడనుండి వెళ్లిపోతుంటారు. ఎందుకనగా వారు ఇతరులు తమకు కలిగించిన కష్టమును ఇబ్బందిని మనసులోనే ఉంచుకొని క్షమించలేని చేదైన వేరును కలిగియుంటారు. దేవుడు కృపగలవాడు. పశ్చాత్తాపపడిన వారందరిని క్షమించుటకు సిద్ధమనసు గలవాడు.

**"కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల ధీర్ఘశాంతముగలవాడై యున్నాడు"** 2పేతురు 3:9. నీనెవె ప్రజలు అన్యులు. తీర్పు వారి మీదకు పంపక మునుపు వారు పశ్చాత్తాపపడడానికి అవకాశము ఇచ్చుటకు దేవుడు యోనాను పంపాడు. కాని యోనాలో వున్న శత్రువులను క్షమించలేని చేదైన వేరు అతనిని కలవరపెట్టింది. దేవుడు అతనిని చేప కడుపులోనికి వెళ్ళునట్లు చేసి నీనెవెకి తీసుకు వెళ్ళినను ఒక్క దినము మాత్రమే ప్రకటించాడు. నీనెవె ప్రజలు ఉపవాసముండి పశ్చాత్తాపపడగా క్షమించిన దేవునిపైనే యోనా తన అసహనమును వ్యక్తపరచెను. ఈ చేదైన వేరు ప్రవక్త హృదయములో ఆత్మల భారము ఆవిరైపోయేలా చేసింది. కొందరు భక్తి చేస్తారు కాని వారి హృదయములో ఎవరో ఒకరి విషయములో ఏ కారణమును బట్టియైనను క్షమించలేని మనసు వుంటుంది. పరిశుద్ధపరచబడిన వారు కీడును ఎన్నడు మనసున ఉంచుకొనరు. దేవుని ప్రేమతో నింపబడినవారై వారికి కీడు చేసిన వారికి మేలే చేయుదురు.

మనము ఇతరులను క్షమించినప్పుడే మనమును క్షమించబడతాము. క్షమించలేని ఈ చేదైన వేరు తొలగించుకొనకపోతే ఆత్మీయ జీవితము కుంటుపడుతుంది. దేవుని ప్రేమలో వేరుపారి సహనము ఓర్పు సహోదర ప్రేమ వీటిలో వృద్ధి చెందినప్పుడు మాత్రమే మన పిలుపును కాపాడుకొని, దానియందు నిలిచి మనకు అప్పగించబడిన దేవుని పనిలో నిష్ఫలులము కాకుండా ఉండగలము.

# దొంగల గుహలో ఎనిమిది రోజులు

రష్యాలో కమ్యూనిజం వచ్చిన తరువాత క్రైస్తవులను హింసించారు. డెక్స్టర్‌గారు దేవుని వాక్యాన్ని బోధించినందుకు ఆయనను అరెస్టు చేశారు. అయినను ఆయన బోధించడం మానలేదు. తోటి ఖైదీలకు సాక్ష్యము చెప్పసాగాడు. బోధించుట మానుకోమని అధికారులు ఆయనకు ఆజ్ఞాపించారు. కాని ఆయన ధైర్యముగా నేను మాట్లాడగలిగినంతవరకు నా యేసుని బోధిస్తాను. న్యాయాధిపతులైన మీకంటే ఉన్నతమైన న్యాయాధిపతి పైనున్నాడు. ఒక దినమున మీరు కూడ ఆయన న్యాయపీఠము ముందు నిలబడాలి అన్నాడు.

వారు ఉగ్రులై పరుష పదజాలంతో దూషించి నీ నోరు మూయిస్తాం చూడు అని చెప్పి కమ్యూనిష్టులుండే గదిలో ఆయనను బంధించారు.

అక్కడ కూడ ఆయన మౌనముగా నుండక వారికి సాక్ష్యమిస్తూ ఎక్కువగా ప్రార్థించసాగాడు. ఒక్కొక్కరు ఆయన దగ్గరకు వచ్చి తమను రక్షణలోనికి నడిపించవలసినదిగా కోరారు. డెక్స్టర్‌ను మరల కోర్టులో హాజరు పరిచారు. కమ్యూనిష్టులు నిన్నీపాటికి మార్చి వేసియుంటారు కదా! అని ఎగతాళిగా అడిగారు. కాని నేను వారికి ప్రార్థించడం నేర్పించాను అని డెక్స్టర్ జవాబిచ్చెను.

నువ్వబద్ధమాడుతున్నావ్ లేదండి, నాకు అబద్ధమాడడం అలవాటు లేదు. నేనెల్లప్పుడు నిజమే మాట్లాడతాను. వాళ్ళు యేసుప్రభువును తమ స్వరక్షకునిగా అంగీకరించారు. వాళ్లిప్పుడు ప్రార్థన చేస్తున్నారు.

భూగర్భ అంతస్థులోని దొంగల గుహలో నిన్ను వేస్తే యింకా బోధించాలనే ఆశ కూడ చచ్చిపోతుంది. అని కొపోద్రేకముతో చెప్పారు.

అనేక గ్రామాలను లూటిచేసి అమాయకుల ప్రాణాలను బలిగొన్న దొంగల ముఠాను ఈ అంతర గృహంలో వేశారు. వారంతా కలిసి తోటి

ఖైదీలను బట్టలూడదీసి వాళ్లను చావగొట్టేవాళ్ళు. డెక్స్టర్‌తోపాటు ఒక రష్యన్ ఫాదర్‌ను మరియు రాజుగారి సైన్యాధిపతిని కూడ దొంగల గుహలోనే వేశారు.

దొంగలు డెక్స్టర్‌ను ఏమీచేయకముందే అతడు దొంగల నాయకుని సమీపించి, కరచాలనం చేసి చిరునవ్వుతో దేవుడు నిన్ను దీవించును గాక మేము కూడ మీలాగే మరణశిక్ష విధించబడిన నేరస్థులము అన్నాడు.

దయతో కూడిన ఈ సాహస కార్యము దయాదాక్షిణ్యములులేని ఆ ముఠా మీద గొప్ప ప్రభావాన్ని చూపింది. ఆ నాయకుడు తన ముఠా సభ్యులను చూచి, ఇంతవరకు ఏ ఒక్కరు కూడ ఈయనలాగా మనతో మాట్లాడలేదు. కాబట్టి ఈయనను మనమేమి చేయకూడదు అని ఆజ్ఞాపించాడు.

ఆ రాత్రి డెక్స్టర్ ఆ మురికి నేలమీద మోకరించి గట్టిగా దేవునికి మొఱ్ఱపెట్టాడు. తన ప్రార్థనలో ఆ గుహలోనున్న సహచర ఖైదీలందరిని జ్ఞాపకం చేసికొన్నాడు. ఆ దొంగలంతా ఆశ్చర్యంగా ఆయన చుట్టూ గుమిగూడి చూడసాగారు. వారు యిలాంటి కార్యములు ఎన్నడు చూడలేదు, వినలేదు కూడా. కొంతమంది ఆయనను ఎగతాళి చేశారు కాని ఆ నాయకుడు చూచిన ఒక్కచూపు వారిని అదుపులో పెట్టింది.

డెక్స్టర్ దొంగలనందరిని తనవైపు ఆకర్షించుకొన్నాడు. ఫాదర్ మాత్రము వారిచేత పీడింపబడుతున్నాడు. "ముసలి కుక్కా" నీవు డెక్స్టర్‌లాగా ఎందుకు ప్రార్థనచేయడం లేదు. ఏవో మంత్రాలలాగా కొన్ని ప్రార్థనలు చేస్తావు. కాని డెక్స్టర్ గారి ప్రార్థనలు మా హృదయాలను కదిలించుచున్నాయి అని వారన్నారు.

"నీవు పాపివని ఒప్పుకొని ప్రభువును వేడుకో ఆయన నీకు సహాయము చేస్తారు" అని డెక్స్టర్ పాదిరితో చెప్పగా పాదిరి మారుమనస్సుపొంది హృదయమంతటితో ప్రార్థించడం నేర్చుకున్నాడు. పాదిరి ప్రార్థనలలో వచ్చిన మార్పును దొంగలు గుర్తించారు. చివరికి సైన్యాధికారి కూడ మారి ప్రార్థించసాగాడు.

డెక్స్టర్‌గారి దగ్గర బైబిల్ లేకపోయినప్పటికీ రక్షణ మార్గమును గురించి వాళ్లందరికి బోధించాడు. రెండవసారి వారికి బోధించినప్పుడు సిలువమీది దొంగలను గూర్చి విని ఆ ముఠా నాయకుడు "సోదరులారా! నాకిది చాలు. మనము చేసిన ఘోరాలన్నిటిని నేను ఒప్పుకొంటాను" అని చెప్పి "మేము చేసినవన్ని భయంకరమైన కార్యాలు" అంటూ అన్నీ ఒప్పుకోసాగాడు.

వీటన్నిటిని చేసిన నన్ను ప్రభువు క్షమిస్తారా? అని దొంగల నాయకుడు డెక్స్టర్ గారిని అడిగాడు. డెక్స్టర్ అవునని చెప్పాడు. ఆ నాయకుడు అధికారుల దగ్గరికి వెళ్లి మొత్తం తాము చేసిన నేరాలన్నిటిని ఒప్పుకొన్నాడు. మిగిలిన దొగంలు కూడ ఒప్పుకొన్నారు. అధికారులు ఆశ్చర్యపోయారు.

ఇది డెక్స్టర్ మూలముగా జరిగినదని తెలుసుకొని మరుసటి దినమున ఆయనను విడిచిపెట్టారు. డెక్స్టర్ వెళ్ళేముందు ఆ నాయకుడు ఆయనతో "నీవు మాకు తండ్రివిగా నున్నావు. మేమెలా ప్రార్థన చేయాలో, ఎలా దేవుని నమ్మాలో మాకు నేర్పించావు. మేమిప్పుడు సంతోషంగా మరణిస్తాము. ఆ మహాదినమున (పరలోకములో) నిన్ను మరల చూస్తాము" అన్నాడు. తరువాత కాలములో డెక్స్టర్ "నేను చెరసాల గుహలో గడిపిన ఆ ఎనిమిది దినములు నా జీవితములో అత్యంత ఆనందకరమైన దినములు" అని వక్కాణించాడు.

**ఒక వ్యక్తి జీవితములో మోకాళ్ళమీద ఉండి ప్రార్థించుట కంటే శ్రేష్ఠమైన సమయము మరొకటి లేదు. నీవు ఎవరికైన ప్రార్థనకు సమయం ఇవ్వు**

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2025-27

### -: మంచిని చేయుటకు సాధనములు :-

మంచిని గురించి ఆలోచించుము. అప్పుడు ప్రపంచమునకు మంచి చేయుటకు ఒక సాధనము వలె ఉపయోగపడుదువు. మోషే, సమూయేలు, దావీదు, దానియేలు మొదలగువారు తమ యౌవనం నుంచే దేవునిని పూర్ణహృదయముతో సమీపించి పరిశుద్ధులుగా మార్చబడి దేవుని సేవ చేసిరి. యౌవన దాసులకు ప్రత్యేకమైన ఘనత ఇచ్చుటకు దేవుడు ఆనందించుచున్నాడు. ఎడ్వర్డ్–6 అను యౌవన రాజును ఇంగ్లాండు దేశములో అతని యౌవనములో దేవునికి అర్పించుకొనుటను బట్టి దేవుడు ఎంతగానో ఘనపరచినాడు. ఎంతమంది యౌవనులు తమ జీవితములోని మంచి సమయమును దేవునికి అప్పగించుకొనుటకు సిద్ధముగా ఉన్నారు? కోతకోయువారు ఇప్పుడు చాలా అవసరము. సత్యమును వ్యాపింపజేయుటకు అన్ని విధములైన సాధనములున్నవి గాని వాటి మీద పనిచేయు చేతులు లేవు. నశించిపోయే ఆత్మలను సంపాదించుటకంటే డబ్బును సులువుగా సంపాదించుచున్నారు. క్రొత్త సంఘములకు నాయకులు కావలెను. క్రొత్త స్థలములకు మిషనరీలు కావలెను, క్రొత్త పాఠశాలలకు అధ్యాపకులు కావలెను. ఈ విధముగా మంచి కారణాలు కలిగిన వాటి కొరకు నమ్మకముగా పనిచేసేవారి అవసరత ఎంతో ఉన్నది. ఎంతోమంది సువార్త కొరకు అవసరమై యున్నారు. యెషయా వలె నేనున్నాను నన్ను పంపుము అని మనము చెప్పగలమా?

To,
Sri / Smt.

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : +91 7893823893

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 4th & 5th of Every Month